సీఎం సభకు భారీ ఏర్పాట్లు



తొర్రూరులో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి దయాకర్‌రావు



కొడకండ్ల : సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

- నేడు తొర్రూరులో బీఆర్‌ఎస్ ఆశీర్వాద సభ
- భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపు
- పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు : శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నేడు (మంగళవారం) తొర్రూరులో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు పట్టణ శివారు మహబూబాబాద్‌కు వెళ్లే రోడ్డులో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తొర్రూరు శివారు మహబూబాబాద్ రోడ్డులో ఏర్పాటు చేసిన సభ కోసం వేదిక, వాటర్ ప్రూఫ్, 50 మంది ఆసీనులయ్యేలా వేదికను సిద్ధం చేశారు. కళాబృందాల ప్రదర్శన కోసం ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలిస్తే జరిగే అభివృద్ధిని, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను సీఎం ప్రజలకు వివరించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు సభ జరగనుంది. పాలకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం సభను దృష్టిలో పెట్టుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. గ్యారంటీ, వారంటీ లేని పథకాలతో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అర్రులు చాస్తోందని మంత్రి దయాకర్ రావు అన్నారు. రైతుబంధు, బీమా ఆపాలని కాంగ్రెస్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం రైతులను మోసగించడమేనన్నారు. సభా ఏర్పాట్ల పర్యవేక్షణలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, డాక్టర్ పి.సోమేశ్వర్‌రావు, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కృషిని చాటాలి

దేవరుప్పుల : తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో సీఎం కేసీఆర్ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్లో చాటాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొర్రూరులో నేటి కేసీఆర్ సభకు నిర్దేశిత జనం కంటే అధికంగా తరలించేలా పార్టీ నాయకులు పాటుపడాలన్నారు. ధరావత్‌తండా బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ కొత్త జలంధర్‌రెడ్డి, సర్పంచ్ గేమానాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సమావేశంలో ఎంపీపీ బస్వసావిత్రిమల్లేశం, జెడ్పీటీసీ పల్ల భార్గవి సుందర్‌రామిరెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ మండల అధ్యక్షుడు రామ్‌సింగ్, ప్రధాన కార్యదర్శి చింత రవి, చామల విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

పాలకుర్తి: ఎన్నికల ప్రచారంలో భాగంగా తొర్రూరు తహల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం పాలకుర్తిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత మరింత అభివృద్ధి చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

పెద్దవంగర: తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన సీఎం కేసీఆర్ సభకు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని చెప్పారు. అభివృద్ధిని చూసి ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దని, వారితో జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈదురు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, పుసులేటి వెంకటరామయ్య, కాసాని హరీశ్, ఎర్రాని రామ్మూర్తి, యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా..

కొడకండ్ల : తొర్రూరులో మంగళవారం నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, అండగా నిలిచి ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. సభకు అన్ని గ్రామాల నుంచి ప్రజలు సభకు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎర్రబెల్లి దయాకర్‌రావు

ప్రజలను అవమానిస్తే పాతరపెడదాం..

రాయపర్తి : పాలకుర్తి ప్రజలను అవమానించిన కాంగ్రెస్‌ను పాతరపెడదామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక కుందూరు కృష్ణారెడ్డి దొడ్డిలో తొర్రూరులో నిర్వహించే సీఎం కేసీఆర్ సభకోసం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాలకుర్తి సభలో దళితులను అవమానిస్తూ కాలుతో తన్నిన రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పేలా సీఎం కేసీఆర్ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇవ్వాల ఇక్కడ రేపు ఎక్కడో తెలియని వాళ్లకు ఓటు వేద్దామా అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్ నర్సయ్య పాల్గొన్నారు.

దయాకర్‌రావు గెలవాలని పూజలు

పాలకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు లక్ష ఓట్ల మెజార్టీతో గెలవాలని కోరుతూ మండలంలోని శివరామపురం దుర్గమ్మ ఆలయంలో 101 కొబ్బరికాయలను కొట్టి పూజ చేశారు. గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు కడెం లక్ష్మీవెంకటయ్య దంపతులు దయాకర్‌రావుపై అభిమానంతో కొబ్బరికాయలను దుర్గమ్మ దేవతకు సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ అనిమిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మండలంలోని జయరాంతండా(కె)కు చెందిన బీజేపీ యూత్ నాయకులు సోమవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు.

గోదావరి జల సిరులకు నర్మెట కేరాఫ్ అడ్రస్



నర్మెట: హన్మంతాపూర్‌లో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



నర్మెట: మల్కపేటలో స్వాగతం పలుకుతున్న నాయకులు, అభివాదం చేస్తున్న పల్లా

- కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేయాలి
- అధికారంలోకి రాగానే అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, 'దళితబంధు'
- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట/జనగామ: కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న జనగామ ప్రాంతంలో సీఎం కేసీఆర్ చలవతో గోదావరి జలాల రాక వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చిందని, అంతటి మహత్కార్యానికి నర్మెట కేంద్ర బిందువుగా మారిందని జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం నర్మెట మండలంలోని డీసీ తండా, మనుబోతుల తండా, మలక్పేట, హన్మం తాపూర్, బొమ్మకూర్, అమ్మాపురం, వెల్దండ, కన్నెబోయినగూడెంలలో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలసి పల్లా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఊరూరా మహిళలు, పార్టీ శ్రేణులు బతుకమ్మ, కోలాటంతో స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలోభాగంగా ఆయన మాట్లాడుతూ జనగామతో పాటు ఎన్నో ప్రాంతా లకు సాగునీరు అందిస్తున్న రిజర్వాయర్లు నర్మెటలోనే ఉన్నాయన్నారు. సీఎం కే సీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగానికి పెద్ద పీట వేయడంతో పాటు అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాల ను అమలు చేశాడన్నారు. మూడవ సారి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్‌బెడ్రూం, దళితబంధు పథకం ఇస్తామన్నారు. కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రిగా చేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు.

లంబాడీలకు సముచిత స్థానం – మంత్రి సత్యవతి రాథోడ్

ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత లంబాడీల జీవన స్థితి గతులు మారిపోయాయని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఆమె మాట్లాడుతూ ఐదు వందల ఓట్లు ఉన్న తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి ఎవరి పాలన వారు చేసుకునే విధంగా అవకాశం కల్పించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అన్నారు. ఈ సారి జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి సీఎం కేసీఆర్, జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, నాయకులు ఎండీ. గౌస్, పెద్ది రాజిరెడ్డి, నీరటి సుధాకర్, చింతకింది సురేష్, ఎంపీపీ గోవర్ధన్ పాల్గొన్నారు.



నర్మెట: మంగళహారతులతో పల్లాకు స్వాగతం పలుకుతున్న మహిళలు

బీఆర్‌ఎస్‌లో చేరికలు

జనగామ మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు, యువకులు బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కాస భాస్కర్ ఆధ్వర్యంలో హన్మంతాపూర్‌లో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

20వ వార్డులో ప్రచారం..

పట్టణంలోని 20వ వార్డులో పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపునకు కౌన్సిలర్ జూకంటి లక్ష్మీశ్రీశైలం, వార్డు అధ్యక్షులు దామెర రాజు, జాయ శ్రీశైలం, జిట్ట శ్రీశైలం, నాగులపల్లి శ్రీశైలం, చిన్నం నర్సింహులు, నోముల శ్రావణ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు.

'పల్లా'కే మా మద్దతు

మద్దూరు(హుస్నాబాద్): జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మండలంలోని లద్నూరుకు చెందిన గౌడ కులస్తులు తెలిపారు. సోమవారం ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఏకగ్రీవ తీర్మానపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు గుజ్జుల సమ్మయ్య, నందనబోయిన నర్సింహులు, దూళ్మిట్ట మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఇమ్మడి సంజీవరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే దూళ్మిట్ట మండలంలోని తోర్నాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.



పల్లాకు ఏకగ్రీవ తీర్మానపత్రం అందజేస్తున్న గౌడ కులస్తులు

ఇంటింటి ప్రచారం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని శివారు కాలనీల్లో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్‌తో కలిసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి భార్య నీలిమ, కుమారుడు అనురాగ్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు.

పల్లాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

బచ్చన్నపేట: బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే జనగామ అభివృద్ధికి కృషి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, యూత్ అధ్యక్షుడు మండల వడ్డెపల్లి ఉపేందర్‌రెడ్డి, నాయకులు షబ్బీర్, జావీద్, కైసర్, దస్తగిరి పాల్గొన్నారు.

జనగామ రూరల్: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని.. ప్రజలు పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ మేకల కళింగరాజు కోరారు. మండలంలోని శామీర్‌పేట లో పల్లాను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇరుగు సిద్దులు, నర్సింగ్, సాల్‌మాన్, భాస్కర్, ఉదయ్ పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి

జిల్లా వ్యాప్తంగా దీపావళి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి ఆనందంగా గడిపారు. దుకాణాలు, ఇళ్లలో లక్ష్మీదేవి పూజలు చేశారు. ఆదివారం నోములు నోముకొని సోమవారం ఎత్తుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్





జనగామ: బాణసంచా కాల్చుతున్న కుటుంబ సభ్యులు



లింగాలఘణపురం: క్రాకర్స్ కాల్చుతున్న జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి తదితరులు

ఈ దోపిడీ ఇంకెన్నాళ్లు



నర్మెటలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



నర్మెట: పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న కొమ్మూరి

- అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాల అమలు
- ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి

నర్మెట/జనగామ: ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకులు తెలంగాణ సంపదను దోచుకు పోగా, ప్రత్యేక రాష్ట్రంలో ఉన్నది ఊడ్చుకెళ్లడానికి ఒకరి వెనకాల మరొకరు బయలుదేరుతున్నారని కాంగ్రెస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. నర్మెట మండలంలోని హన్మంతాపురం, ఇప్పలగడ్డ, వెల్దండ, బొమ్మకూర్, హనుమతండాల్లో సోమవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం కొమ్మూరి మాట్లాడుతూ జనగామలో ఓటు కోసం తిరుగుతున్న స్థానికేతరులకు ఓటు వేసి మరోసారి మోసపోవద్దన్నారు. ప్రస్తుతం జనగామలో కోళ్లనుతినే నేత అందినకాడికి దోచుకోగా, ఇప్పుడు గొర్లను తినోటోళ్లు అభివృద్ధి చేస్తామంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారన్నారు. తెలంగాణలో జరిగిన అభివృద్ధి నాటి కాంగ్రెస్ హయాంలో చేసిందే అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని పేర్కొన్నారు. నర్మెట ప్రజలు తనకు రాజకీయ భిక్ష పెడితే జెడ్పీటీసీ, ఎమ్మెల్యేగా సేవలందించే భాగ్యం కలిగిందని, ఇప్పుడు భారీ మెజార్టీతో గెలిపిస్తే జనగామను సంపూర్ణంగా అభివృద్ధి చేస్తానన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మండల కేంద్రంలో వడ్డెర సంఘం, పద్మశాలీ, రజక, హమాలీ సంఘాలు, రైజింగ్ స్టార్ యూత్, ఎస్సీకాలనీ యూత్‌లతో పాలు పలుపార్టీలకు చెందిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాగా, వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. నాయకులు గంగం నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, కుమార స్వామి, కూకట్ల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జనగామలో..



వేచరేణిలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

పట్టణంలోని 24వ వార్డు శివాలయంలో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గెలుపు కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగరబోయిన మల్లేశం, సీనియర్ నాయకులు జాయ మల్లేశం , ఎర్రమల్ల సుధాకర్, గాదెపాక రాజేందర్, చెంచారపు బుచ్చిరెడ్డి, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీ స్కీంలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, చేయి గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం చేశారు. 2, 3.14వ వార్డుల్లో మహిళా కాంగ్రెస్ అధ్వర్యంలో కొమ్మూరి కోడలు కొమ్మూరి దివ్యరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, కౌన్సిలర్ వంగాల కళ్యాణి, మునిబేగం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే..

చేర్యాల(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆపార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాగపురి, వేచరేణి, చిట్యాల, అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన రెండు ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన కేసీఆర్ వాటిని తుంగలో తొక్కారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అన్నివర్గాల ప్రజలు బలంగా నమ్ముతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పాలనపై విసుగు చెందిన ప్రజలు ఇందిరమ్మ రాజ్యం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజలు ఆశీర్వదిస్తే జనగామ నియోజకవర్గ ప్రజలకు అవినీతి రహిత పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్‌లీడర్ గిరి కొండల్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ము రవి, కౌన్సిలర్ సందుల సురేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మద్దూరు మండలంలోని వంగపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ చల్లా లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా సుధాకర్‌రెడ్డితో పాటు 40 మంది సోమవారం కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



బచ్చన్నపేట: పూజ చేస్తున్న కొమ్మూరి

ఆలయ అభివృద్ధికి కృషి

బచ్చన్నపేట: వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆలయాలకు మహర్దశ కల్పించారని కాంగ్రెస్ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం బండనాగారంలోని రామలింగేశ్వరాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డిని ఆలయ అర్చకులు శాలువాతో సన్మానించారు. నాయకులు కొల్ల నర్సిరెడ్డి, చల్ల సురేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, స్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

స్థానిక నాయకుడిని ఎన్నుకోవాలి

అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో అందుబాటులో ఉండే స్థానిక నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఎన్నుకోవాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నల్లగోని బాలకిషన్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వార్డుల్లో, పలు గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంటు కష్టాలు తప్పవు

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీకి ఓటువేస్తే పదేళ్ల క్రితం ఉన్న కరెంటు కష్టాలు మళ్లీ వస్తాయని, ప్రజలు ఆగం కాకుండా ఆలోచించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని శివునిపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, వినోద్, ఎంపీపీ రేఖ, సుధీర్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

కడియంను కలిసిన యూత్ నాయకులు

రఘునాథపల్లి: పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ యూత్ నాయకులు సోమవారం జిల్లా యువజన నాయకుడు కుర్ర కమలాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో కడియం శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిశారు.

శ్రీహరికి రజక సంఘం మద్దతు

చిల్పూరు: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరికే తమ పూర్తి మద్దతు తెలుపడంతో పాటు ప్రచారంలో ముమ్మరంగా పాల్గొంటామని రజక సంఘం నాయకుడు సురేష్ తెలిపారు. కొండాపూర్ గ్రామానికి చెందిన సంఘం నాయకులు సోమవారం సర్పంచ్ లోడెం రజితరవీందర్, ఎంపీటీసీ ఐలమ్మ ఎల్లయ్య, గ్రామ అధ్యక్షుడు గాలి ప్రవీణ్ ఆధ్వర్యంలో శ్రీహరిని కలిసి మద్దతు ప్రకటించారు.

జయప్రదం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు: ఈనెల 20వ తేదీన స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్లు శివారులో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలని కడియం శ్రీహరి కోరారు. సోమవారం సభాస్థలిని ఆయన పరిశీలించి మాట్లాడారు.

సింగపురం ఇందిర జన్మదిన వేడుకలు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సింగపురం ఇందిర జన్మదిన వేడుకలను కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చేపూరి చిరంజీవి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

రక్తదానం

చిల్పూరు: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిర పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదివారం మండలంలో కేకులు కటేయడంతో పాటు రక్తదానం చేశారు.

లింగాలఘణపురం: మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు బుర్రెడ్డి శ్రీలతారెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తరిగొప్పుల: కుటుంబ కలహాల నేపథ్యంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతారం గ్రామానికి చెందిన చింతల కృష్ణ(36) కొన్ని సంవత్సరాల క్రితం మండలకేంద్రానికి కుటుంబసభ్యులతో వలస వచ్చి స్థిరపడ్డాడు. కాగా, మద్యానికి బానిసై కుటుంబ పోషణను మరచిన కృష్ణ రోజువారిలాగే శనివారం మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య శ్యామల మందలించింది. దీంతో తన స్వగ్రామమైన పోతారంలో తండ్రి సమాధి సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమీప రైతులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బెంచీల బహూకరణ

కొడకండ్ల: లయన్స్‌క్లబ్ పక్షాన తన తండ్రి దామెర శ్రీహరి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు జిల్లా లయన్స్‌క్లబ్ అంగర్ రిలీఫ్ చైర్మన్ సహకారంతో పబ్లిక్ ప్రదేశాల్లో సేద తీరేందుకోసం 10 సిమెంట్ బెంచీలను సోమవారం బహూకరించారు.

ఆర్థికసాయం

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పోలు రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి రూ. 5వేల పంపించగా సోమవారం నాయకులు అందజేశారు.

ఆర్థికసాయం

జనగామ రూరల్: పెంబర్తి గ్రామానికి చెందిన అంబాల కిష్టయ్య సోమవారం మృతి చెందాడు. కాగా, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దహన సంస్కారాలకు రూ.10 వేలు అందజేశారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు నాయకుడు వంశీధర్ రెడ్డి నివాళులర్పించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

వెండి ప్రాణవట్టం సమర్పణ

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి వారికి పాలకుర్తికి చెందిన భక్తులు రామగిరి నాగరాజు, స్రవంతి, జనగామకు చెందిన పబ్బ నాగేశ్వర రావు, అన్నపూర్ణ, ముప్పారపు రాములు, హైమావతి, అయితే శ్రీనివాస్, అన్నపూర్ణ దంపతులు సుమారు 3.5 కేజీల వెండి ప్రాణవట్టం సమర్పించినట్లు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న సోమవారం తెలిపారు. అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ యూత్ అధ్యక్షుడిగా ఇమ్రాన్

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాలలో సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. యూత్ అధ్యక్షుడిగా ఎండీ ఇమ్రాన్‌ను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు గద్దమీది సురేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఇల్లందుల యాదగిరి ప్రకటించారు.

సభాస్థలి పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్: నేడు డివిజన్ కేంద్రంలో నిర్వహించనున్న కాంగ్రెస్ విజయభేరి సభకు ముఖ్య అతిథిగా టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకానుండగా సభా స్థల ఏర్పాట్లను కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర పార్టీ నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు.

కాంగ్రెస్‌లో చేరిక

దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి యతిరాజా రావు తనయుడు, వడ్డె కొత్తపల్లి సర్పంచ్ నెమురుగొమ్ముల ప్రవీణ్ రావు, మండలంలోని రామచంద్రాపురానికి చెందిన బీఆర్‌ఎస్ ఉప సర్పంచ్ కేతువుల రేణుక, కొండయ్య, రాయపర్తి మండలానికి చెందిన బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకుడు గోపాల్‌రెడ్డి, బురహాన్ పల్లి ఎంపీటీసీ బిజ్జాల సంధ్య, సోమనాథంతో పాటు 200 మంది సోమవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

పాలకుర్తిలో కాంగ్రెస్‌దే గెలుపు

కొడకండ్ల: అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తిలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి నామినేషన్ ఆమోదం అనంతరం రాజేష్‌నాయక్ యూత్ కాంగ్రెస్ పక్షాన ఆమెను సన్మానించారు.

రాజీనామా

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ జెడ్పీటీసీ పుట్టపురి సదయ్య కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటనలో తెలిపారు.